"అమ్మా! ఇవాళ ఏమిటంత ఆనందంగా ఉన్నావు?"

"నేనివ్వాళ పార్క్‌లో దేవుడితో కలిసి కారపు అటుకులు తిన్నాను తెలుసా?" ఆనందంగా చెప్పిందావిడ.

"నిజంగా?"

"అవును. నేనూహించిన దానికన్నా దేవుడు ఎంతో చిన్నవాడు." కూతురికి చెప్పిందావిడ.

## 48. కాపలా

చాలా ఏళ్ళ క్రితం జరిగిన కథ ఇది.

అప్పట్లో మల్లప్ప అనే ఓ భక్తుడు శ్రీశైలంలో ఓ అన్నదాన సత్రాన్ని నిర్వహిస్తూండేవాడు. ఆ సత్రానికి అనేకమంది దాతలుండేవారు.

ఓ రోజు మల్లప్ప దాతలిచ్చిన డబ్బుతో ఆహార పదార్థాలు కొనుక్కురావడానికి శ్రీశైలంనించి ఆత్మకూరు బయలుదేరాడు. దారంతా చిట్టడవి. ఆ రాత్రి అడవిలో ఓ చెట్టు కింద నిద్రించి మర్నాడు ఉదయం ఆత్మకూరు చేరుకున్నాడు.

బజారులో ఓ ధనవంతుడు కనిపించి ఆహార పదార్థాలన్నీ తనే మల్లప్పకి కొనిచ్చాడు.

"మీ సత్రానికి నేను, మా ఊరివాళ్ళం అనేకసార్లు వచ్చి భోజనం చేసాం. అందుకు బదులుగా నేను చేయగలిగే కనీస సేవ ఇది." చెప్పాడతను కృతజ్ఞతగా.

అదంతా ఆ మల్లికార్జునుడి కృప అనుకుని మల్లప్ప ఆ ఆహార పదార్థాలతో, తనతో తెచ్చిన రొక్కంతో తిరుగు ప్రయాణం చేసాడు. దారిలో ఆ రాత్రి కూడా అడవిలో అదే చెట్టు కింద పడుకున్నాడు. క్షణాల్లో అతనికి గాఢనిద్ర పట్టింది. తనని దోచుకోడానికి ఆత్మకూరు నించి ఓ దొంగలముఠా తనని వెన్నంటి వస్తోందన్న సంగతి అతనికి తెలీదు.

మర్నాడు ఉదయం లేచి శ్రీశైలంలోని తన అన్నదాన సత్రానికి చేరుకున్నాడు మల్లప్ప. రెండు రోజుల తర్వాత అతను శ్రీశైలం వచ్చిన కొందరు భక్తులకు అన్నం వడ్డిస్తూంటే వారిలోంచి నలుగురు లేచి అకస్మాత్తుగా మల్లప్ప కాళ్ళమీద పడి తమని క్షమించమని వేడుకున్నారు.

"దేనికి క్షమించడం?" ఆశ్చర్యంగా అడిగాడు మల్లప్ప వాళ్ళని.

"నువ్వు మొన్న ఆత్మకూరు నించి ఆహారం, డబ్బుతో బయలుదేరుతున్నావని పసికట్టి మేము నిన్ను దోచుకోడానికి నిన్ననుసరించాం. రాత్రి ప్రయాణ బడలికలో నువు గాఢనిద్రలో ఉండగా నిన్ను చంపి నీ దగ్గర ఉన్నవన్నీ దోచుకోవాలనుకున్నాం. కాని నీచుట్టూ విల్లంబులు ధరించిన ఏడుగురు మనుషులు కాపలా కాస్తూ కనిపించారు. దాంతో మా ప్రయత్నాన్ని విరమించుకున్నాం." చెప్పారు వాళ్ళు.

వాళ్ళ మాటలకి ఆశ్చర్యపోయిన మల్లప్పకి వాళ్ళు అబద్ధం చెప్తున్నారని కూడా అనిపించింది.

"మీదంతా ఉట్టి భ్రమ. నాకు కాపలాగా నేను ఎవర్నీ వెంట పెట్టుకుని వెళ్ళలేదు." బదులు చెప్పాడు.

భోజనం చేస్తున్న ఆ పంక్తిలోని మిగిలిన వారందరు ఆ మాటలు విని ఒకరి మొహాలు మరొకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు. తర్వాత వాళ్ళలో ఒకడు ఆ దొంగలని అడిగాడు.

"అది సరిగ్గా ఏ రాత్రి జరిగిందో చెప్పగలవా?"

"ఆదివారం రాత్రి."

వాళ్ళల్లోని ఇంకొకడు వెంటనే చెప్పాడు.

"ఎంత చిత్రం! మేమంతా శ్రీశైలం దర్శించాలనుకుని అదే రోజు రాత్రి ఆత్మకూరు నించి బయలుదేరాం. ఆ రాత్రి మేము అడవిలో నిద్రలో ఉండగా మా అందరికీ అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. ఒకరికొచ్చిన మా

కలలని గురించి ఇంకొకరికి చెప్పుకున్నాం. మా అందరికీ ఆ కలల్లో అన్నసత్రం మల్లప్ప గురించి ప్రార్థించాలన్న ప్రేరణ ఎందుకో కలిగింది. దాంతో ఆ రాత్రి చాలాసేపు ఆ ప్రార్థన చేస్తూండి పోయాం.''

అది విన్న భోజన పంక్తిలోని వారంతా ఆశ్చర్యంగా తమలో తాము మాట్లాడుకుంటూంటే, మల్లప్ప మాత్రం గబగబా వాళ్ళని లెక్కపెట్టాడు.

వాళ్ళు సరిగ్గా ఏడుమంది ఉన్నారు!

## 49. బార్బర్

క్షవరం చేయించుకోడానికి ఓ వ్యక్తి బార్బర్ దుకాణానికి వెళ్ళాడు. పని జరుగుతూండగా కాలక్షేపానికి వాళ్ళిద్దరూ మాటల్లో పడ్డారు. అనేక విషయాలు మాట్లాడుకున్నాక వారి సంభాషణ తిరుపతిలో జరిగే బ్రహ్మోత్సవాల మీదకి మళ్ళింది.

ఆ బార్బర్ నాస్తికుడు కావడంతో చెప్పాడు.

''దేవుడనేవాడు లేడండి. అయినా లక్షలమంది వెర్రివాళ్ళయి ఎందుకలా తమ డబ్బు, కాలం ఖర్చు చేసుకుని తిరుపతికి వెళ్తున్నారో నాకర్థం కావడంలేదు.''

''దేవుడు లేడని ఎందుకనుకుంటున్నావు?'' ప్రశ్నించాడా కస్టమర్.

''ఓసారి అలా రోడ్డు మీదకి వెళ్ళి చూడండి. దేవుడనే వాడంటూ ఉంటే, ఇంతమంది రోగులూ, అనాథ పిల్లలు, ఇంత దుఃఖం ఈ ప్రపంచంలో ఎందుకుంటుంది? వీటన్నిటినీ చూస్తూ వాళ్ళ కన్నీరు తుడవకుండా, ఏంచేయకుండా ఉంటాడా దేవుడు?''

ఆ కస్టమర్ భక్తిపరుడే అయినా ఆ విషయం మీద చర్చ అనవసరం అనుకుని దాన్ని ఖండించలేదు. తన పని పూర్తయ్యాక డబ్బిచ్చి ఆ షాప్‌లోంచి బయటకి వెళ్ళాడు.